# జీవన్ముక్తుడు

**మా**మంచిపురం నుంచి రామదుర్గం వెళ్ళే అయిదు గంటల బస్సు ఆ రోజు సాయంకాలం ఒక గంట ఆలస్యంగా బయల్దేరింది. కారణం, పది రోజుల పొడుగునా ఒకటే చిత్తడి వానలు. గట్టి కంకరరోడ్డు కాబట్టి సరిపోయింది. అదే మట్టిరోడ్డయితేనా, శుభ్రంగా సర్వీసే మాను కోవలసింది...

అప్పటికైనా బస్సు కదిలిందంటే అందుకు ముఖ్యకారకుడు బూరగమంద చెన్నారెడ్డి. రెడ్డి చెరువు క్రింద మూడెకరాల పొలంలో మడికోసి, బండపైన కుప్పలు పెట్టించి పదిరోజులయింది. కోసిననాటి నుంచీ ఆకాశం చిల్లులుపడిపోయినట్టుగా జల్లులే జల్లులు. కరువులో అధికమాసంలాగా ఈ వానల్లో అర్జంటు కోర్టు పనొకటి అఘోరించింది. వాన కొంచెం తెరపి యిచ్చేది చూసుకుని, వాదెకొట్టి వడ్లు యింటికి చేర్చమని మరి మరీ చెప్పిన తర్వాతనే అతడు బస్సెక్కాడు. పాలేర్లున్నూ నమ్మకస్తులే! ఏమైనా పనిమనిషులు పనిమనుషులేకదా! అయిదారు వేల రూపాయల వరమానమాయె! రెడ్డి మనసు వడ్లరాసి చుట్టే గిరికీలు తిరుగుతోంది.

“ఏమోయ్ కేశవులూ! తొమ్మిదింటికల్లా నన్ను మా వూళ్లో దించేశావంటే నీ కొక కోడిపెట్ట ఇనాం” అంటూ డ్రయివరుకు బక్షీసు గూడా ప్రకటించాడు చెన్నారెడ్డి.

తొందరపడి వాగ్దానమైతే చేయలేదుగానీ, ఏడ్చేదాని మొగుడొస్తే నా మొగుడూ వచ్చినట్టేగదా అని సంతోషిస్తున్నాడు తుమ్మపాడు వరహాలయ్య. అతడి ప్రాణం తుమ్మపాడులో, తన చిల్లరకొట్లో, మూడు నెలల క్రితం కొని స్టాకు పెట్టిన కొబ్బరికాయల చుట్టూ పల్టీలు కొడుతోంది. తెల్లవారితే ఒక్కపొద్దుల పండగ. ఎంత లేమిడి కుటుంబమైనా విధిగా జోడు కొబ్బరికాయలు కొట్టి తీరాల్సిన పని. వేరేపనిమీద పట్నం వెళ్ళబట్టి అక్కడ బజారులో కాయధర రూపాయి పలుకుతోందని తనకు తెలిసింది. పల్లెలో వుంటే ఏం తెలుస్తుంది? కాయ ఒకటికి ఏ అరవై పైసలకో, ముప్పావలాకో తెగనమ్మితే ఎంత నష్టం?

నంగమంగలం సుబ్బారాయుడి పరిస్థితి మరింత దయనీయంగా వున్నట్టు ఒప్పుకోవాలి. మార్కెట్టు ‘డౌను’గా ఉన్నందువల్ల దాదాపు ఏడాదినుంచీ ఆయన దగ్గర నూరు మూటల చెరకుబెల్లం నిలవుండిపోయింది. ఆ సరుకు ఏ గదిలోనైతే ‘స్టాకు’ చేయబడిందో ఆ గదిలోకి, మిద్దెపైభాగంలో నుంచీ ఓ రంధ్రం వుంది. ఎండబోసిన ధాన్యాన్ని క్రిందికి తోసుకోడానికి వీలుగా అమర్చిన ఆ రంధ్రంపైన ఓ మూతను బోర్లించి పెట్టడం రివాజు. కానీ ఆడుకోడానికని

మిద్దెపైకి వెళ్లే కుర్రకుంకలు దాన్ని తరచుగా అవతలికి తోసేస్తుంటారు. తానుగనుక యింట్లో వున్నట్టయితే, నాయుడు వానచినుకు నేలపైన పడగానే పైకివెళ్లి ఆమూత సరిగ్గా వున్నదీ లేనిదీ చూసుకునేవాడు. రెండు మూడు రోజులుగా తానింట్లో లేడు. ఏమయిందో ఏమిటో? వాన కురుస్తున్నప్పుడు ఓ గంటసేపు గనుక ఆదమరిస్తే, ఆ తరువాత కడవల్లోకితోడి దిబ్బల్లో పారబోయడానికి తప్పితే ఆ బెల్లం మరొక సత్కార్యానికి పనికిరాదు.

రెక్కలు కట్టుకుని వెళ్ళి, గమ్యస్థానంలో వాలిపోవాలన్నంత వేగిరపాటయితే లేకపోవచ్చుగానీ మిగిలిన వాళ్ళు కూడా ఏవో ముఖ్యమైన పనులమీద ప్రయాణం కడుతున్నవారే. నందవరం సీతారామయ్య ఓ పెళ్ళి సంబంధం చూచి రావడం కోసం రామదుర్గం వెళ్తున్నాడు. పులిచెరువు నాగప్ప గిత్తల బేరం కోసం పైడిమర్రికి పయనమయ్యాడు. అల్లుడికి అనారోగ్యంగా వుందని తెలిసి మల్లెల గురుమూర్తి ముత్యాలరేవుకు ప్రయాణం పెట్టుకున్నాడు. పోగా బజారు పనిమీద పట్నానికి వచ్చి, పని కాగానే తిరిగి వెళ్తున్న సమీప గ్రామాల వాళ్ళు గూడా ఏడెనిమిది మంది దాకా బస్సులో ఉన్నారు.

బస్సు యింకొక అరగంటలో బయల్దేరుతుందనగా తన బిడ్డలిద్దరితోబాటుగా లోపలికెక్కి వచ్చిన ఓ నడివయసు ఆడమనిషి, ఉత్సాహమన్న మాట ఏ కోశానా లేకుండా దిగాలుపడి కూర్చున్న ప్రయాణీకుల వాలకాలు గమనించినదై 'బాబూ! ఈ బస్సు ఎన్నింటికి రామదుర్గం చేరుతుందండీ?' అని ప్రశ్నించి, 'అమ్మా! ఈ బస్సుల సంగతి మనమేమీ చెప్పలేము! అంతా దైవాధీనం. ఆ మబ్బులూ మోడాలూ ఎలా వున్నాయో చూస్తున్నావు గదా' అన్న జవాబు వినిపించడంతో – దిగ్గున బస్సు దిగి దూరంగా వెళ్ళిపోయింది. మంత్రగాడి ముగ్గులో విబూది పండ్లకు మల్లే బస్సులో పలచపలచగా పది పదిహేను మంది జనం మాత్రమే వుండిపోయారు.

వెళ్ళడమా, మానడమా అన్న విచికిత్సలోబడి, మానుకోవడం వైపే మొగ్గు చూపుతూ టీస్టాల్లో బైటాయించిన కండక్టరు నారాయణ ఏకధాటిగా బస్‌హారన్ గొంతు చించుకోడంతో త్రుళ్ళిపడి, పరుగునా వచ్చి బస్సెక్కేశాడు.

సందేహిస్తున్నట్టుగా ముందుకూ వెనక్కూ మూడుసార్లు కదిలి, 'సరే మీ యిష్టం' అని రాజీకి దిగినట్టుగా బస్సు తేమరోడ్డుమీద ముందుకు సాగబారింది. ఊరి శివారు దాటుకునేసరికి బస్సు సవ్వడితో శ్రుతికలుపుతూ వానజల్లు పడటం ప్రారంభమైంది. నల్లటి మబ్బుల ఆవరణ క్రింద చూస్తూ చూస్తూ వుండగానే ప్రపంచం చీకటిలో మునిగిపోయింది. కండక్టరు టికెట్లు 'బుక్' చెయ్యడం ముగించి, తెరలన్నీ దిగవిడిచి, వెళ్ళి వెనక సీట్లో ఒంటిగా కూచున్నాడు.

బీభత్సంగా వున్న వాతావరణంలో నిమ్మకు నీరెత్తినట్టు నిశ్చలంగా కూచోవడం ప్రయాణీకుల చేతగావడం లేదు. తుమ్మపాడు వరహాలయ్యకైతే ఎవరితోనైనా బిగ్గరగా మాట్లాడకపోతే మతిపోయేటట్టే వుంది. నంగమంగలం నాయుడుగారున్నూ, బూరగమంద రెడ్డిగారున్నూ అప్పుడే ఏవో రాజకీయాల చర్చలో నిమగ్నులై పోయారు. వరహాలయ్య కొట్లో రాజకీయాలకు చెల్లుబడిలేదు.

అందుకని తాను మాటల్లోకి దింపదగిన వ్యక్తి కోసం చేస్తున్న అన్వేషణలో వరహాలయ్య చూపులు ఎట్టయెదుట మూడో వరుసలో కూచున్న సన్యాసిపైకి వెళ్ళి వ్రాలాయి. బస్సులో ఆ సన్యాసి పొలకువ కంతగా గుర్తింపు లభ్యం కాలేదంటే అందుకు కారణం అతడు అరమోడ్పు కళ్ళతో నిశ్చలంగా కూర్చుని వుండడమే కావచ్చు. ఏటిగట్టున రెల్లుపొదలా తెల్లబడి, దుబ్బులా బలిసిపోయిన జుత్తూ, గడ్డమూ గూడా ఆయన ముఖంలో పెదవులు, ముక్కు, కళ్ళు, నుదురు లాంటి పరిమిత భాగాలను మాత్రమే పైకి కనబడనిస్తున్నాయి. బస్సంతా కలయజూసినప్పుడు సన్యాసి ఉనికిని ప్రస్ఫుటంగా తెలియచేస్తున్నవి అతడు ధరించిన కావిరంగు దుస్తులు.

స్వాముల వారిని దూరం నుంచి మాట్లాడించడం బాగుండదనిపించి వరహాలయ్య లేచి వెళ్ళి ఆయన కెదురుగా వున్న సీట్లో కూర్చున్నాడు. 'ఏం బాబూ! ఏం కావాలి?' అన్నట్టుగా సన్యాసి కళ్ళు విప్పారాయి.

"స్వామీ! ఈ వర్షం యిట్లా మొదలై పదిలోజులైంది. ఏ పని చేసుకోడానికైనా యిబ్బందిగా వుంది. రైతులకు పొలం పనులు సరిగ్గా సాగడం లేదు. వ్యాపారస్తులైతే కొట్లలో ఈగలు తోలుకోవలసి వస్తోంది. బళ్ళు, ఆఫీసులు, సినిమాలు అన్నీ అంతంత మాత్రంగానే జరుగు తున్నాయి. ఈ వానయోగం యింకెన్ని రోజులుంటుందంటారు స్వామీ?" సర్వప్రపంచానికి తానే 'గార్డియన్‌షిప్' పుచ్చుకున్నట్టుగా విజ్ఞాపన చేసుకున్నాడు వరహాలయ్య.

సన్యాసి పెదవులపైన చిన్న నవ్వొకటి ప్రాకింది. "నాయనా! ఈ వాన నువ్వు కోరుకుంటే వచ్చిందిన్నీ కాదు. నువ్వు వద్దనుకుంటే పోయేదిన్నీ కాదు. ఏదెప్పుడొస్తుందో, ఏదెప్పుడు పోతుందో చెప్పడానికి మనం కర్తలమా? అంతా వాడిలీల!"

వాడి లీల కనీసం తమకైనా తెలియదా స్వామీ– అని మనసులోనే గింజుకున్న వరహాలయ్య "తమరెందాకా వెళ్తున్నారు స్వామీ?" అంటూ ప్రసంగాన్ని యింకొక మలుపు తిప్పాడు.

"నువ్వెక్కడికి బాబూ?"

ప్రశ్నకు ప్రశ్న ఎదురైంది.

"నాగులేటికా ప్రక్కన తుమ్మపాడుంది గదండీ! అదే మా వూరు."

"అయితే నీకీబస్సు తుమ్మపాడు దాకా వెళ్తే చాలు. అంతే కదూ?"

"అంతేనండీ! ఎంతదూరం? రోడ్డులో బస్సు దిగితే ఓ అరమైలు ఉంటుంది. చక్కా నడిచి వెళ్ళిపోగలను."

"చూచావా నాయనా! నువ్వు వెళ్ళవలసిన చోటు తుమ్మపాడు. బస్సందాకా వెళ్తే చాలునని నువ్వనుకుంటావు. ఆ తర్వాత యిదేమైపోయినా నీకు దిగులుండదు..."

"అబ్బే, అది కాదండీ నేను చెప్పడం..."

"పరవాలేదులే! ఉన్నమాట చెప్పుకోడానికి ఉలుకెందుకు? నువ్వేకాదు. మనుషులందరూ యింతే! తమ తమ నెలవులు తాము క్షేమంగా చేరుకోగలిగితే చాలుననుకుంటారు. ఆపైన

తాము ప్రయాణించిన వాహనం గాని, తోడి ప్రయాణీకులు గానీ ఏమైనా పట్టించుకోరు... ఏమంటావు పెద్దాయనా?"

వరహాలయ్య కూచున్న సీట్లోనే ఓ మూలగా ఒదిగి కూర్చున్న ముసలి వ్యక్తి ఉలిక్కి పడ్డాడు. స్వాములవారు హఠాత్తుగా తననిలా పలకరించేసరికి ఏం చెప్పాలో తోచక తడబడిపోతూ "స్వాములూ! మీరేం మాట్లాడుతున్నారో నాకు తెలీడం లేదండీ! నే నచ్చురం ముక్క రానోణ్ణి. ఎద్దుల్ని కొట్టి, ముద్దలు తింటూ బతికినోణ్ణి" అంటూ స్వవిషయం తేటతెల్లంగా చెప్పుకున్నాడు.

ఆ పాటికి వరహాలయ్యస్వాముల వారితో తన ప్రసంగం సజావుగా కొనసాగేటట్టు లేదని గ్రహించాడు. అంతకంటే తన ప్రక్కన కూర్చున్న పక్కా పామరుణ్ణి మాటల్లోకి దించడమే అతడికి నయమనిపించింది. కొరకరానికొయ్యకంటే చొప్పదంటయినా మేలే.

"ఏమయ్యా పెద్దాయనా! ఏవూరు మీది?" నల్లేరు పైకి నడిచే బండిలా వరహాలయ్య ఉపక్రమించాడు.

"నాదా బాబూ! పుట్టింది పెదరావూరు. పెరిగింది తిమ్మసముద్రం. పెళ్ళాడింది పాతకోట. గంజి కరువొచ్చినప్పుడు వలసబోయింది తూరుపుగడ్డ. తిరిగొచ్చినాక రోడ్డుకోసం గుల్లకొట్టింది విజ్జలాపురం. డాం కట్టడంలో కూలీగా పన్జేసింది పదిపుట్ల బయలు. పెళ్ళాం పోయింది గండికాడ వేంపల్లి. ఏవూరని యివరమడిగితే ఏం జెబుదును బాబయ్యా? కలిగిన మారాజుకైతే ఒకటే వూరు. లేని బీదోడికి ఎక్కడ పొట్టగడిస్తే అదే వూరు..."

ఇదేమీ చొప్పదంటు కాదురాబాబో అనుకున్నాడు వరహాలయ్య. మాలావు గట్టి చెరుకే! ఆదరాబాదరాగా తింటే పేడుతో పెదవో నాలుకో గీసుకుపోయేటట్టుగా వుంది!

అందుకనే ఈసారి నిమ్మళంగా ప్రారంభించాడు వరహాలయ్య. "మంచి మాటే చెప్పావులే పెద్దాయనా!మరైతే అన్ని వూళ్ళూ చెప్పావే గానీ, యిప్పుడెళ్తున్న దేవూరో చెప్పలేదే!"

"ఇప్పుడెళ్ళే వూరా! అదేదో మంచి వూరే బాబూ. నోటికి రావడం లేదు. రామదురగంలో దిగి, ఎల్లమంద వెళ్ళే బస్సెక్కితే పదిహేనో మైలురాయి కాడ వుంటుందండి! ఆ వూళ్ళో రాంకోటిగారని .... ఓయబ్బో, సాలా పెద్ద సావుకోరంట. ఆయన కొబ్బరితోటలో కాపుదారిగా వుంటానికని వెళ్తున్నాను. మావూరి రామ్మూర్తి పంతులుగోరు సీటీ రాసిచ్చార్లెండి! ఈయనా, ఆయనా సిన్నప్పుడు వొక బళ్ళో సదువుకున్నారంట..."

బస్సు రోడ్డుపైన్నే పరుగిడుతోందో, తిక్క మళ్ళి అడ్డదారే పట్టిందో ప్రయాణీకులకు అంతుపట్టడంలేదు. దారిపొడుగునా దిగేవాళ్ళే గానీ బస్సెక్కే ప్రయాణీకులు కానరావడం లేదు. బస్సులో కూర్చున్న వాళ్ళు గూడా ఎప్పుడెప్పుడు బయటపడి పోదామా అన్న తత్తరపాటుతో, ముళ్ళపైన కూర్చున్నట్టుగా తహతహలాడిపోతున్నారు.

"ఏమయ్యో కండక్టర్! లింగాల బావి దాటగానే నాతో చెప్పమన్నాను. నేను కుమ్మరోళ్ళ సత్రం దగ్గర దిగెయ్యాలి అంటూ ఒకరు –"

"తామరకుంట కావైపున బైరాగుల మర్రి లేదటయ్యా! అక్కడ నన్ను దించడానికి మరిచిపోకు!" అంటూ యింకొకరు–

"మదినేపాడు చెరువు మరవ దగ్గర నన్ను దింపుతావు గదూ" అంటూ వేరొకరూ, యిలా వుండి వుండీ ఒక్కొక్క ప్రయాణీకుడూ కండక్టర్ని హెచ్చరించుకుంటూనే వున్నాడు.

పట్టగలిగినంతసేపూ ఓపిక పట్టి ఆఖరుకు కండక్టరు చిచ్చుబుడ్డిలా ప్రేలిపోయాడు.

"అయ్యా, ప్యాసెంజర్లూ! అప్పటికి మీవి సాదా కళ్ళున్నూ, నావి ఎక్స్‌రే కళ్ళా? మిన్నూ మన్నూ, కొండా కోనా, చెట్టూ గుట్టా అంతా ఒకటే నల్లటి తెర గుడ్డలా అలుక్కుపోయిందయ్యా! ఎవరు దిగాల్సిన చోట వాళ్ళే గమనించుకోవడం మంచిది. లేదంటే– మబ్బుతో మల్లయుద్ధం చేస్తూ, తన తంటాలేవో తాను పడుతున్నాడు గదా– ఆ డ్రయివర్‌తోనే చెప్పుకోండి!"

జరుగుతున్న ప్రసంగం వల్ల వరహాలయ్యకొక విషయం తెలిసి వచ్చింది. బస్సింకా లింగాల బావి, కుమ్మరోళ్ళ సత్రం వగైరా, వగైరాలు దాటలేదు. ఇవన్నీ దాటితేనే నాగులేరు. నాగులేటి కవతలి గట్టున తుమ్మపాడు. ఈ ముసలాణ్ణి యింకొక ట్రిప్పు మాటల్లోకి దించితే ఈ లోగా బస్సు నాలుగైదు మైళ్ళ దూరం వెళ్ళిపోవచ్చు.

"అయ్యో పాపం! వయసుడిగిన రోజుల్లో పొట్ట పూడ్చుకోవడం కోసం ఊరుకానివూరు వెళ్తున్నావు. నీకు నా అన్న వాళ్ళెవరూ లేరేమయ్యా పెద్దాయనా?"

పళ్ళులేని బోసినోటితో ముసలతను ముసిముసినవ్వులు నవ్వుకున్నాడు. నవ్వడం పూర్తయిన తర్వాత "గంపెడు బిడ్డల గంగన్నను పట్టుకుని ఎంత మాటన్నారండీ బాబుగోరూ!" అన్నాడు.

"అట్లాగా! ఎందరయ్యానీకు బిడ్డలు?" వరహాలయ్యకు పాయింటి దొరికినట్టయింది.

"పెద్దోడు వరదయ్య పాణ్యం సిమెంటు పాక్టరీలో పన్జేసుకుంటూ బతుకుతున్నాడు. రెండోవోడు రామాంజులు. ఓ బండీ, కాడెద్దులూ పెట్టుకుని సంత యాపారం చేస్తున్నాడు. మూడోవోడు నాదముని. కరెంటు పన్జేస్తాడు. ఇంటికి వైర్లు తగిలించి, బలుబులు బిగిస్తే వాడికో వంద రూపాయలైనా చేతికొస్తాయి. నాలుగోవోడు దరమయ్య. తాలూకాఫీసులో బిళ్ళ బంట్రోతు. కడగొట్టోడు ముక్కంటి. నిరుడు ఇలాంటప్పుడే వాడికి పెళ్ళి చేశాను. బీడీవోగారి దగ్గర జీపు డ్రయివరుగా వున్నాడు. కొడుకుల సంగతి సెప్పానా! కూతుళ్ళు ముగ్గురండీ బాబుగోరూ! పెద్ద కూతుర్నిచ్చింది చీనేపల్లె. వాళ్ళకు నాలుగెకరాల మెట్టవుంది. కొంచెం మాగాణి కౌలుకు చేస్తారు. రెండో కూతుర్ని కొండపాలెంలో యిచ్చాను. అల్లుడక్కడ రోడ్డు మేస్త్రీగా వున్నాడు. మూడో కూతుర్ని కాపురానికి పంపి ఆరునెల్లయింది. చిన్నల్లుడు చుట్టుపక్కల పల్లెల్లో పాలు పోయించుకుని సైకిలు పైన చిత్తూరు తీసుకెళ్ళి అమ్ముకుంటాడు."

చిక్కావురా మిడతం బొట్లూ– అనుకున్నాడు వరహాలయ్య. "ఎందరుండి ఏం లాభం లేవోయ్ గంగన్నా! ఇందరిలో ఎవరి పంచన పడివున్నా నీ కాలం గడిచిపోయేది. అందర్నీ వదులుకుని నీపాటుకు నువ్వెళ్ళి పోతున్నావు. ప్చ్..... ప్చ్...." నిట్టూర్చాడు.

"బాబుగోరూ! బతికినంతకాలం ఒకరికి పెట్టినోణ్ణేగానీ, ఒకరి తిండి తిన్నోణ్ణికాదు. బిడ్డలకు రెక్కలొచ్చాయి. వాళ్ల బ్రతుకు వాళ్ళు బతుక్కుంటున్నారు. నాదేముంది? ఎక్కడైనా నావల్లనయ్యే పని నేన్జేసుకుంటాను. జానెడు పొట్టకోసం ఒకర్ని కాపెట్టుకుని కూచుంటామా?"

వరహాలయ్య ముసలాడి వైపు బిక్కరించి చూశాడు. చూస్తూ చూస్తూ విస్తుపోయాడు- ఇల్లు లేదు, వాకిలి లేదు. సెంటు జాగా లేదు. కట్టుకున్న పంచ, పైన వేసుకున్న గొంగడీ తప్పితే యింకొక బట్ట లేదు. అయినా ఈ ఎముకల గూడులో ఎంత ధీమా ఏడ్చిందిరా బాబూ!"

బస్సు లింగాలబావి దాటింది. కుమ్మరోళ్ల సత్రం దగ్గర ఆగింది. బైరాగులమర్రిని సమీపిస్తోంది.

బూరగమంద రెడ్డిగారున్నూ, నంగమంగలం నాయుడుగారున్నూ రాజకీయాలపైన కొనసాగిస్తున్న చర్చ ఈలోగా ఒక కొలిక్కి వచ్చింది. ఉన్నట్టుండి నాయుడుగారి ధ్యాస ఎందువల్లనో బస్సులో ఒక మూల నిశ్చలంగా మౌన వ్రతం పట్టి కూచున్నస్వాముల వారి పైకి మళ్ళింది. "ఎక్కడో చూచినట్టుందిగానీ, ఈ స్వాములవారెవరో గుర్తుకురావడంలేదు గదయ్యా!" అన్నాడు నాయుడు.

"ఆనందాశ్రమం సదానందస్వాముల వారు గదంటయ్యా! రామదుర్గానికయిదు మైళ్ళలో ఏనుగుమల్లమ్మకొండ కిందనే ఆయన ఆశ్రమం. ముప్పై ఏళ్ళ క్రిందట ఆయనక్కడికొచ్చి ఓ చిన్న పాకేసుకున్నారట! ఇప్పుడాశ్రమానికి మళ్ళున్నాయి. పాడిగొడ్లున్నాయి. మేడలున్నాయి. వచ్చిపొయ్యే జనానికి తక్కువ లేదు. పెద్ద తిరణాల్లా వుంటుందిలే!"

"అట్లా చెప్పు. అయితే మనకంటే పెద్ద సంసారేనే!" కిసుక్కున నవ్వేశాడు సుబ్బానాయుడు.

"ఎక్కడో పాదపూజకు వెళ్ళొస్తున్నట్టున్నారు లేవయ్యా! అందుకోసమని దేశంలో చాలా చోట్ల నుంచి స్వాముల వారికి పిలుపులొస్తుంటాయి. ఊరికే కాదు. పాదపూజకో రేటుంటుంది తెలుసా! నూటపదార్లిచ్చుకోవాలి..."

"లాభసాటి బేరమేనే!" విస్తుపోతూ అన్నాడు సుబ్బానాయుడు.

బస్సు ముదినేపాడు చెరువు కట్ట దాటుకునేసరికి వాన బాగా వెలిసిపోయింది. నడకొండల్లాంటి మబ్బులు కొన్ని ప్రక్కలకు ఒత్తిగిల్లడంతో ఆకాశాన నక్షత్రాలు కూడా కానరాసాగాయి. తెర తొలగించి వెలుపలికి చూసిన వరహాలయ్య 'ఇంకెంత దూరం! మూడు మైళ్ళే కదా!" అనుకున్నాడు.

ఆ మూడు మైళ్ళ దూరం గూడా పదినిముషాల్లో గడిచిపోయింది.

డ్రయివరు నాగులేటి ఒడ్డున బస్సు నిలబెట్టి "ఏటిలో నీళ్లొస్తున్నాయే!" అన్నాడు.

గచ్చునేలపైన దొర్లుతున్న పాలకు మల్లే తెల్లటి నురగలు గ్రక్కుతే, ఎర్రటి నీరు ఏటిలోని యిసుకనంతా పొదివి పట్టుకుంటూ ప్రవహిస్తోంది.

పుట్టలోని పాములా, తానెక్కడుందన్న జాడ సైతం తెలియరాకుండా, కంకర రోడ్డు ఏటి కడుపులో మాటు పడిపోయింది.

"పరవాలేదులే! వానవొస్తే ఏటికెల్లవ రావడం మామూలే! ఒక్క బిర్రున నువ్వు ముందుకు వెళ్లిపోవయ్యా కేశవులూ..." హుషారిచ్చాడు చెన్నారెడ్డి.

"అవునవును. సూటిగా రోడ్డుపైన్నే వెళ్ళిపోతే సరి!" అన్నాడు సుబ్బానాయుడు.

అసలు బస్సు బయల్దేరడానికే విముఖుడైన కండక్టరు నారాయణ 'దిగగలిగితే ఏటిలో దిగండి. లేకుంటే ఏటి గట్టునే జాగారం చేయండి' అన్నట్లుగా బిర్ర బిగుసుకుని కూర్చున్నాడు.

"వరద ఎక్కువగావచ్చు. తొందరగా వెళ్లిపోవడం మంచిది."

"వచ్చినపాటున ముందుకెళ్ళి వుంటే ఈ పాటికి తుమ్మపాడు దాటి వుండే వాళ్ళం."

"అయినా స్వతహాగా తనకే తెంపుండాలి గానీ డ్రయివరుకు మనం ధైర్యం చెప్పాలంటే అవుతుందా?"

ప్రయాణీకుల్లో ఇలా కట్టలు తెంచుకుంటున్న అసహనాన్ని డ్రయివరు ఎలాడో నాలుగైదు నిమిషాల వరకు సహించగలిగాడు. ఆ తరువాత వున్నట్టుండి ఏదో పూనకం వచ్చినవాడిలా బస్సును స్టార్టు చేసి నీటిపైకి వదిలేశాడు.

ఆపైన పదిహేను నిమిషాల వరకూ ఏటిలో చెలరేగిన సందడిని మాటలతో వర్ణించడం సాధ్యం గాదు.

'పరవాలేదు, పోనీ పోనీ' అన్న గగ్గోలుకు, 'ఉండు, వుండుండు, ఒరిగిపోతోంది' అన్న గావుకేకలకు మధ్య, కుడివైపు చక్రాలు రెండూ రోడ్డుపైన్నుంచీ పక్కవాటుకు తప్పుకోవడంతో, మళ్ళీ రోడ్డు దారి పట్టించే ప్రయత్నంలో ఒక యిసుక మేట అడ్డు తగలడం వల్ల కొంత దూరం వెనక్కు రావలసి వచ్చి, అలా చేయడంలో ఎడమ వైపు చక్రాలు కూడా పల్లంలోకి దిగేయడంతో బస్సొక సుడిగుండంలో స్తంభించిపోయింది.

ముందువైపు ఇంజనులోకి, వెనకవైపున ప్రవేశ ద్వారంలో నుంచీ బస్సులోకి ఉచ్చులు తెంచుకున్నట్లుగా ప్రవాహజలం చొచ్చుకరాసాగింది.

మృత్యుభయం శరీరంలోకి విద్యుత్తు లాంటి శక్తిని రవాణా చేస్తుందేమో తెలియదు. ఏ దారిగుండా వెలుపలికి వచ్చారో, ఏ విధంగా పైకి ప్రాకిపోయారో గానీ కొద్ది క్షణాలలోగా ప్రయాణీకులందరూ బస్సు టాపుపైన వున్నారు.

తడి ఆరిపోయిన నాలుకతో నిలువునా కంపిస్తున్న శరీరాలతో కొలిమితిత్తుల్లా రొప్పుతున్న గుండెలతో ప్రాణాలను గుప్పిట్లో పట్టుకున్న ఒక చిన్న జనసమూహం; అలాంటి దృశ్యాన్ని చిత్రీకరించడం కోసమని నదీగర్భంలో వేసిన సెట్టింగులాంటి బస్‌టాపు.

చిట్టడవుల నడుమనుంచి పొడుగాటి గోధుమవన్నె త్రాచులా పడుతూ లేస్తూ వంపులు తిరుగుతూ వస్తున్న వరదనీరు, ఆ త్రాచు నోటిలో నిస్సహాయంగా చిక్కుపడిపోయిన బావురు కప్పలా-- బస్సు!

❖ ❖ ❖

అర్ధరాత్రి కావచ్చేసరికి నీటిమట్టం యింకొక అడుగు పైకిలేచింది. బస్‌టాపు నుంచీ చెయ్యి క్రిందికిచాచితే అందేటంతవరకూ పెల్లుబికి నీళ్ళు విచ్చలవిడిగా ప్రవహిస్తున్నాయి.

"చచ్చేది నిజం. బ్రతికేది అబద్ధం. ఈ చావుగడియల్లోనైనా ఒక మంచి మాట చెవిలో వేస్తావా స్వామీ?" దీనంగా అర్థించాడు చెన్నారెడ్డి.

స్వాములవారు ఆకాశంవైపు చూసారు. అంతర్ముఖుడైనట్టుగా కళ్లు మూసుకున్నారు. పరధ్యానంలో నుంచి తేరుకున్నట్టుగా వున్నట్టుండి "ఏమిటయ్యా! ఏమన్నావు?" అని ప్రశ్నించారు.

"అనడానికేముంది స్వామీ! ఈ నట్టేట్లోనే బ్రతుకు తెల్లవారేటట్టుంది. బ్రతికినంత కాలం ఏవేవో ప్రాకులాటలతో సతమతమౌతూ 'కృష్ణా, రామా' అనుకునే ఓపరికమే లేకపోయింది. కనీసం యిప్పుడైనా మీరొక మంచిమాట సెలవిస్తే వినాలని వుంది." విడమరచి చెప్పుకున్నాడు చెన్నారెడ్డి.

"సంసారమనే వూబిలో కూరుకుపోయిన వాళ్ళం. దీన్నుంచి బయటపడే ఉపాయం మీరే చెప్పాలి" --- అంటూ సుబ్బానాయుడు గూడా బ్రతిమాలుకున్నాడు.

"దయపెట్టండి స్వామీ! ఏదైనా మంత్రోపదేశం చేసినాసరే! చివరి క్షణాల్లో జపిస్తూ కళ్ళు మూస్తాము" నందవరం సీతారామయ్య మరింత ప్రయోజనకరమైన ప్రతిపాదన చేశాడు.

స్వాములవారు గొంతు సవరించుకున్నారు.. "ఇదొకరు చెప్పగా యింకొకరు వినడానికి తగిన పరిస్థితిగాదు. ఎవరికి వాళ్ళే ఆత్మశోధన చేసుకోవాల్సిన సమయం. జీవితంలో దు:ఖమే ఎదురుకావడం ఎందుకని ప్రశ్నించి, తీరని కోరికలవల్లనేనని జవాబు చెబుతారు పెద్దలు. చేసిన పాపం చెబితే పోతుంది గదా! మీ మీ తీరని కోరికలేవో చెప్పుకుంటే, ఆ బంధం నుంచి విముక్తి పొందవచ్చు..."

చిక్కిబిక్కిరించినట్టుగా ముఖం పెట్టాడు చెన్నారెడ్డి. "ఏం చెప్పమంటారు స్వామీ? చెరువునీరు ఒక పంటకు మాత్రం సరిపోతుంది. రెండో పంటకోసం చెరువు క్రింద ఒక బావి తవ్వించి పంపుసెట్టు పెట్టించాలనుకున్నాను. ఆ కోరిక తీరకనేపోయింది" అన్నాడు.

మోకాళ్ళపైన తలానించుకుని ఖిన్నుడై కూర్చున్న సుబ్బానాయుడు "కన్ను మూసేలోగా కాశీ, రామేశ్వరం చూసి రావాలనుకున్నాను. నాకంత అదృష్టం గూడానా!" అంటూ నిట్టూర్చాడు.

టౌనులో బాగా వ్యాపారం జరిగే సెంటరుగా చూసి, పెద్దఎత్తున చిల్లరకొట్టు పెట్టుకోవాలన్నది వరహాలయ్య కోరిక. బాగా చదువుతున్న కుమారుడికి వాడి చదువుకు తగిన ఉద్యోగం దొరకకపోవడం గురుమూర్తి మనసును తొలిచివేసే చింత. నాగప్పకు భూములైతే వున్నాయిగానీ, వుండడానికి తగునైన యిల్లులేదు. ఒక్కగానొక్క కూతురు సీతారామయ్యకు బోలెడంత ఆస్తి. ఆ పిల్ల కడుపున ఒక కాయగాయకపోవడం అతనికి తీరని చింత.

చిట్టచివరకు తన జీవితంలోని అసంతృప్తి ఏమిటో చెప్పుకోవలసిన వంతు గంగన్న దాకా వచ్చింది. మడిచిన గొంగళి తలక్రింద పెట్టుకుని అతడు గుర్రు పెడుతూ గాఢంగా నిద్ర పోతున్నాడు.

బరువుగా గడుస్తున్న కాలాన్ని చీల్చుకుంటూ సీతారామయ్య ప్రశ్నించాడు. "మరైతే స్వామీ! తమ కోరికేమిటో తాము చెప్పలేదే?".

స్వామీజీ త్రుళ్ళిపడ్డాడు. "అబ్బే మాకేం కోరిక. మేం కోరుకునేది ముక్తి. ఈ కట్టె కడతేరిపోయిన తర్వాతనేగదా అది లభించేది" అన్నాడు.

"బ్రతికుండగా ముక్తి లభించదా స్వామీ?" శ్రద్ధాళువైన ఆదర్శశిష్యుడిలా ప్రశ్నించాడు సీతారామయ్య.

స్వాములవారు ఏదో చెప్పబోయి, నిద్రపోతున్న గంగన్న ముఖంలో ప్రతి ఫలిస్తున్న ప్రశాంతిని గమనించినవారై, మునిపంటితో పెదవి కొరుక్కుంటూ, మౌన ముద్రలోకి జారిపోయారు.

❖ ❖ ❖

తెల్లవారేటప్పటికి వరదకాస్తా తగ్గుముఖం పట్టింది. ఒడ్డుపైన్నుంచీ మోకుదాళ్ళు చేరవేసి ప్రయాణీకుల్ని సురక్షితంగా బయటికి లాగేశారు. 'ఏమయ్యా పెద్దాయనా! నిండుగా పారుతున్న ఏటిలో బస్సు టాపుమీద నీ కెలా నిద్రపట్టింది?' అని తోడి ప్రయాణీకుడెవరో ప్రశ్నిస్తే, గంగన్న సిగ్గుతో బుర్రగోక్కుంటూ 'అబ్బే, నాదేముందండీ బాబుగారూ! పదిమందితో సావంటే, పెళ్ళితో సమానం గదా!' అంటుండడం వినిపించింది.

❄

యువ దీపావళి సంచిక 1977